క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


గొట్లగట్టులో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కొనకనమిట్ల: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం గొట్లగట్టులో పీహెచ్‌సీ వైద్యులు ఎస్పీ బాలయ్య పర్యవేక్షణలో డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనారోగ్యం బారిన పడిన వారు ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.ఆదినారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం కెతూర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, సహోద్యోగులు

కంభం: మండలంలోని యర్రబాలెం ప్రాథమిక పాఠశాలలో గత 8 ఏళ్లుగా ఉపాధ్యాయురాలిగా పనిచేసి తురిమెళ్ల గ్రామానికి బదిలీపై వెళ్తున్న జ్యోతిలక్ష్మమ్మను సహోద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. సర్పంచ్ మద్దు శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాల లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, రాజశేఖర రాజు, ఎస్ఎంసీ చైర్మన్ పిక్కిలి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి


పోస్టర్‌ను విష్కరిస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు

బేస్తవారిపేట: విద్యుత్ మీటర్ రీడర్లకు సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆ యూనియన్ అధ్యక్షుడు శ్యామ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. షిఫ్ట్ ఆపరేటర్స్‌గా, పోల్ టూ పోల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాచ్‌మెన్, అటెండర్, బ్రేక్ డౌన్ సిబ్బందిగా రీడర్స్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. యాజమాన్యం నిర్ణయించిన పనిదినాలు యథావిధిగా కొనసాగించాలని, ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేంద్రబాబు, ప్రసాద్, ఫణి, అలీ, రమణ పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత


శాకంబరి రూపంలో దర్శనమిస్తున్న వాసవీమాత

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని రాజాజీ వీధిలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వాసవీమాతకు విశేష పూజలు

అర్ధవీడు: మండలంలోని పాపినేనిపల్లిలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని అర్చకులు ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

పశ్చిమాన భారీ వర్షం

మార్కాపురం:

పశ్చిమ ప్రకాశంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ వర్షం కురిసింది. మార్కాపురం పట్టణంలో పలు కాలనీలు జలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక జీజీహెచ్‌లో అంతర్గత రోడ్లపై వర్షం నీరు నిలవడంతో రోగులు, ప్రజలు నడిచేందుకు సైతం వీల్లేకుండా పోయింది. వేములకోట వైపునుంచి వచ్చే జీజీహెచ్ రహదారి బురదమయంగా మారింది. పట్టణంలోని పూలసుబ్బయ్యకాలనీలోని బిలాల్ మసీదు ఎదురుగా ఉన్న రోడ్డులో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇదిలా ఉండగా భారీ వర్షం పత్తి, సజ్జ, జొన్న, కంది పంటలకు మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షపాతం వివరాలిలా..

యర్రగొండపాలెం మండలంలో 122.4 మి.మీ, తర్లుపాడు 49.8, పుల్లలచెరువు 49.4, బేస్తవారిపేట 46.4, రాచర్ల 46.2, పెద్దారవీడు 42.8, మార్కాపురం 36.2, అర్ధవీడు 20.2, గిద్దలూరు 26.8, కంభం 19.4, దోర్నాల 18.6, కొమరోలు 17.2, త్రిపురాంతకం మండలంలో 6.2 మి.మీ మేర వర్షం కురిసింది.


బిలాల్ మసీదు వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు


జీజీహెచ్ గేట్-2లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కార్యకర్తలకు అండగా ఉందాం

- వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో 'అన్నా'


అన్నాను సన్మానిస్తున్న అనుబంధ విభాగం నాయకులు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తనతోపాటు నియోజకవర్గ ముఖ్య నాయకులందరూ అండగా ఉండి వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాట్లాడారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా దిశానిర్దేశం చేశారు. కూటమి పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసి ఇష్టారీతిగా వ్యవహరిస్తోందని అన్నా ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టే పనులకే ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నంటే ఉండి మళ్లీ సీఎంగా చేసుకునేందుకు కృషి చేద్దామన్నారు. కొనకనమిట్ల మండలంలో కూటమి నాయకుల మాటలు విని కొందరు అధికారులు వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నా దృష్టికి తెచ్చారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా పార్టీ అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటామని అన్నా భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు అన్నా రాంబాబును గజమాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో వెలిగండ్ల సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు బేతా ప్రకాష్‌రెడ్డి, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు తంగిరాల బ్రహ్మారెడ్డి, ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షుడు పార్లపల్లి నబీ, బీసీ సెల్ అధ్యక్షుడు పావులూరి వెంకటేశ్వర్లు, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి


సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి
- విస్తృత స్థాయి సమావేశ ఏర్పాట్ల పరిశీలన

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. ఈ నెల 21న గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో నిర్వహించనున్న పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించి పార్టీ నేతలకు సూచనలు సలహాలు ఇచ్చారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితోపాటు పలువురు ముఖ్య నాయకులకు హాజరుకానున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రజల్లో వైఎస్సార్ సీపీపై అభిమానం మెండుగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని భరోసా ఇచ్చారు. కేపీ వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, బత్తిన ఓబులరావు, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, సీఆర్ఐ మురళి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, స్వామిరంగారెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, వెంకటరావు, గోడి వెంకటేశ్వరరెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో లాభసాటి వ్యవసాయం


మాట్లాడుతున్న వనరుల కేంద్రం ఏఓ శైలజ

కొనకనమిట్ల: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ పేర్కొన్నారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద మేలైన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం సిద్ధవరం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ముందస్తుగా పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తే భూసారం పెరుగుతుందని సూచించారు. రైతులకు సబ్సిడీపై ఇచ్చే పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కై.ప్రకాష్‌రావు, ఏఈఓ విక్రమ్, వీఏఏ చిన బాబు, గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు

పెద్దదోర్నాల: ఆదివాసీ గిరిజన రైతులు సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక లాభాలు పొందాలని ఐసీడీఎస్ సీడీపీఓ కమలకుమారి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఆరు గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. సీడ్లాయస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓతో పాటు మండల వ్యవసాయ విస్తరణాధికారి చైతన్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగు, ఇంటి ప్రాంగణంలో పోషక తోటల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు, తల్లులకు 18 రకాల కూరగాయల విత్తనాలు అందించారు. తల్లులు, గర్భిణులు ఐసీడీఎస్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. సీడ్లాయస్ సంస్థ ప్రోగ్రాం ఇప్లిమెంటర్ వైశాలి, ఆర్ఓఎఫ్ఆర్ కో ఆర్డినేటర్ మంతన్న, బాలరాజు, పుష్పలత పాల్గొన్నారు.

ఆటోవాలాల చైతన్యానికి స్పందన

యర్రగొండపాలెం: గుంతలతో కూడుకున్న రోడ్లపై తమ వాహనాలు నడపలేక ఆటో డ్రైవర్లే పుల్లలచెరువు రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చుకున్న సంఘటన గత నెల 29న 'సాక్షి'లో 'గుంతలు పూడ్చుకున్న ఆటో డ్రైవర్లు' శీర్షికన ప్రచురితమైన వార్తకు రోడ్లు, భవనాల శాఖాధికారులు స్పందించారు. ఈ మేరకు యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువుకు వెళ్లే రోడ్డును అభివృద్ధి పరిచేందుకు సన్నాహాలు చేశారు. తొలివిడతగా యర్రగొండపాలెం వైపు నుంచి 10 కిలో మీటర్ల వరకు తారు రోడ్డు వేసేందుకు రూ.2.85 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఆ శాఖాధికారి ఒకరు తెలిపారు.

సర్పంచ్ మృతికి మాజీ ఎమ్మెల్యేల సంతాపం


నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం మండలం కోలభీమునిపాడు సర్పంచ్ సీహెచ్ సుబ్బారెడ్డి(55) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జులు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి తదితరులు సుబ్బారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మా వెంకటరెడ్డి, బొగ్గు రవిచంద్రారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం

రాష్ట్ర కార్యదర్శిగా మస్తాన్


అన్నా రాంబాబును సన్మానిస్తున్న మస్తాన్ తదితరులు

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తర్లుపాడు మండలం కేతగుడిపి సర్పంచ్ పెద్దమస్తాన్‌ను పార్టీ మైనారిటీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా మస్తాన్ ఎంపీపీ రామసుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మురారి, వైస్ ఎంపీపీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లతో కలిసి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ సెల్ మండల అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన తుమ్మలచెరువుకు చెందిన సయ్యద్ మహబూబ్ సుబానీ, దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షుడిగా నియమితులైన బండారు వెంకటేశ్వర్లు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబును కలిసి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారికి అన్నా రాంబాబు సూచించారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంచాలి



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: వేతనం పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మార్కాపురం మున్సిపల్ కార్యాలయ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సోమయ్య, రూబెన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నిత్యావసర సరుకులతోపాటు అన్ని ఖర్చులు పెరిగాయని, అందుకు అనుగుణంగా వేతనం ఇవ్వకపోతుండటంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు సమానంగా కాంట్రాక్టు కార్మికులకు జీవో నంబరు 36 ప్రకారం వేతనం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికులకు ఆర్థిక సాయంతోపాటు విశ్రాంత కార్మికులకు పింఛను ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టు కార్మికుల సమ్మె సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలను పది నెలలు అవుతున్నా అమలు చేయలేదని, ఇప్పటికైనా ఆర్థిక శాఖ నుంచి అనుమతి తీసుకుని వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, సలామ్, హరి, వెంకటేశ్వర్లు, శేఖర్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్సై రవీంద్రారెడ్డి

పొదిలి రూరల్: డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని సీఐ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి నడవడికతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకుంటూనే సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యక్తిగత ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అరుణకుమారి, ఎస్సై వేమన, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


ఉప్పలపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బేస్తవారిపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాత మల్లాపురంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్ వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


కంభంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీస్, పంచాయతీ అధికారులు

- డీపీఓ వెంకట నాయుడు


మార్కాపురంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకట నాయుడు

మార్కాపురం: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్‌లోని పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు, ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బాలూనాయక్ మాట్లాడుతూ.. పీ4 సర్వే సమగ్రంగా చేయాలని, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలి

కంభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కంభం సీఐ కె.మల్లికార్జునరావు పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంలో శుక్రవారం ఉదయం పంచాయతీ అధికారులతో కలిసి పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, ప్రతి ఒక్కరూ ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలని సూచించారు. దుకాణాల ముందు చెత్తాచెదారం పడేయవద్దని చెప్పారు. నాలుగు రోజుల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిలిపేయని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, ఎంపీడీఓ వీరభద్రాచారి, డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, కార్యదర్శి రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారులు సహకరించాలి


మూతపడిన మార్కాపురం హెడ్‌పోస్టాఫీసు

మార్కాపురం టౌన్: మార్కాపురం డివిజన్ పరిధిలోని పోస్టాఫీసుల్లో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు పోస్టల్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. మార్కాపురం, పొదిలి హెడ్ పోస్టాఫీసుల పరిధిలో సుమారు 49 సబ్ పోస్టాఫీసులు, 400కు పైగా బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. 6.41 లక్షలకు పైగా ఖాతాదారులు ఉన్నారు. పోస్టాఫీసుల్లో కొత్త సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తున్న దృష్ట్యా సేవలు నిలిపేశామని సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఖాతాదారులు, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.